సాక్షి ములుగు

ఆదివారం | 5 | మే | 2024

I



ఎన్నికల నియమాలు పాటించాలి - IIలో▸

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు నియమాలు పాటించాలని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.



వడదెబ్బతో ఏడుగురి మృతి

ఎండ మేడిమిని తట్టుకోలేక శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడుగురు మృతి చెందారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
43^0 /28^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కల్వర్టుల తనిఖీ



వెంకటాపురం(ఎం): మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల పరిధిలోని కల్వర్టులతో పాటు, పోలింగ్ కేంద్రాలను బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసినట్లు వెంకటాపురం ఎస్సై చల్లా రాజు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గోవిందరావుపేట: పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ శనివారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండల పరిధిలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాలైన రంగాపూర్, ముత్తాపూర్, ప్రాజెక్ట్ నగర్ తో పాటు సమస్యాత్మకమైన చల్వాయి, పస్రా గ్రామాల పోలింగ్ కేంద్రాలను పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ లతో కలిసి ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో గతంలో జరిగిన ఎన్నికల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరగటానికి డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అవుతుందని బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సీతారాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యకర్తలు నిరంతరం సైనికుల్లా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్లూరి రఘురామ్, జాడి లక్ష్మి, శ్రీనాథ్, లక్ష్మిపతి పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్ట్ షిఫ్ట్ సమయాలు మార్చాలి



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో పని వేళలు మార్చాలని కోరుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని కార్మికుల పని సమయాలను మార్చాలని కోరారు. ఓపెన్‌కాస్ట్ ఉద్యోగులు అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట రామచందర్, ఎండీ కరిముల్లా, అల్లి చేరాలు, కృష్ణ, మధు, విజేందర్, కృష్ణారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్ని వాయిదా వేయాలని వినతి!

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఈనెల 6 నుంచి నిర్వహించే డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2,4,6 సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కొందరు విద్యార్థులు శనివారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసి విన్నవించినట్లు సమాచారం. ఎండలు తీవ్రంగా ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది కలగొద్దని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారని, వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఈ విషయమై రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు సకాలంలో నిర్వహిస్తేనే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా టీఎస్‌ఐసెట్, పీజీసెట్ తదితర ప్రవేశ పరీక్షలు ఉంటాయని అందువల్ల డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు వాయిదా వేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈనెల 6 నుంచి యథావిధిగా పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ సందడి

ఓ వైపు పార్లమెంట్, మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికలు

- ప్రధాన రాజకీయ పార్టీలకు సవాల్‌గా మారిన వైనం
- గెలుపు, ఓటముల లెక్కల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు
- బీజేపీ అభ్యర్థిపై ఇంకా వీడని సస్పెన్స్



2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

పల్లా రాజేశ్వర్‌రెడ్డి(బీఆర్‌ఎస్)	తీన్మార్ మల్లన్న(స్వతంత్ర)	ప్రొఫెసర్ కోదండరాం(టీజేఎస్)
1,61,811	1,49,005	71,126
గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి(బీజేపీ): 39,306	రాములు నాయక్(కాంగ్రెస్): 27,729	

సాక్షిప్రతినిధి, వరంగల్:

ప్రధాన రాజకీయ పార్టీల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందడి మొదలైంది. వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 2న నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. అదే రోజు నుంచి నల్లగొండ కలెక్టరేట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మొదలైన నామినేషన్ల ప్రక్రియ ఈనెల 9న ముగియనుంది. 10న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంది. అయితే ఎమ్మెల్సీ నామి నేషన్ల ఉపసంహరణ రోజే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉంది. మరోవైపు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ఈనెల 27న ఉదయం 10 నుంచి 4 గంటల వరకు జరగనుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడిన మరుసటి రోజు ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు, ఫలితాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కూడా ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. దీంతో ఆయా పార్టీల ఎన్నికల ఇన్‌చార్జ్‌లు అభ్యర్థుల ఎంపిక మొదలు ఓటర్ల జాబితాలపై మల్లగుల్లాలు పడుతున్నారు. గెలుపు ఓటముల విశ్లేషణ, ఓట్ల లెక్కల్లో నిమగ్నం కావడంతో ఎన్నికల సందడి జోరందుకుంది.

అప్రమత్తంగా కాంగ్రెస్..

వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నను పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించింది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డిపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 12,806 ఓట్ల తేడాతో ఓటమి చెందిన తీన్మార్ మల్లన్నను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దింపింది. బీఆర్‌ఎస్ అధిష్టానం ఆ పార్టీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ ప్రకటన చేశారు. బీఆర్‌ఎస్ నుంచి పలువురు ఉద్యమకారులు, సీనియర్లు ఆశించినప్పటికీ.. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. రెండు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా.. బీజేపీ అధిష్టానం తమ అభ్యర్థి ప్రకటనపై సస్పెన్స్‌లో పెట్టింది.

ఆ ముగ్గురిలో ఎవరు..?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసేందుకు ప్రధానంగా ముగ్గురు ఆసక్తి చూపుతున్నారు. గతంలో రెండుసార్లు ఇదే స్థానానికి పోటీ చేసి.. 2021 ఎన్నికల్లో 39,306 ఓట్లు సాధించి నాలుగో స్థానంలో నిలిచిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సీరియస్‌గా ప్రయత్నం చేస్తున్నారు. రెండు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ప్రేమేందర్‌రెడ్డికి మూడోసారి అవకాశం ఇస్తారా? అన్న చర్చ జరుగుతోంది. కాగా మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భువనగిరి జిల్లాకు చెందిన కాసం వెంకటేశ్వర్లు, మరో ఇద్దరు నాయకులు పులి సరోత్తంరెడ్డి, డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి సైతం ఈసారి గట్టిగా పట్టుపడుతున్నట్లు పార్టీవర్గాల సమాచారం. రాష్ట్ర పార్టీకి తాజాగా మళ్లీ దరఖాస్తు చేసినట్లు చెబుతున్నారు. మరో సీనియర్ నేత, క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నారన్న చర్చ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికి అవకాశం దక్కుతుందో? అనేది మరో రెండు రోజుల్లో తేలుతుందని పార్టీవర్గాల సమాచారం.

మూడో రోజు నలుగురు నామినేషన్లు

నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు శనివారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. కర్నె రవి నేషనల్ నవక్రాంతి పార్టీ తరపున ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బైరబోతుల శ్రీనివాసరావు, దైద సోమసుందరం, బక్క జడ్సన్ నామినేషను పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్. మహేందర్‌కు అందజేశారు.

సఖి సెంటర్‌ను సందర్శించిన జడ్జి

ములుగు: జిల్లాకేంద్రంలో సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి టి.కన్నయ్యలాల్ సందర్శించారు. సఖి సెంటర్‌లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లా బాలల పరిరక్షణ కార్యాలయం, చైల్డ్‌లైన్, బాలల సంక్షేమ సమితి కార్యాలయాలను పరిశీలించారు. బాలలకు ఉన్న సమస్యలు, వస్తున్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, సఖి సెంటర్ అడ్మిన్ లావణ్య తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి కన్నయ్యలాల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఏటూరునాగారం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అధికారులకు హెచ్చరించారు. మండల పరిధిలోని చెల్పాకలో రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్పయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మొదటగా హాజరు పట్టికను పరిశీలించి ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ సంతకాలు లేకపోవడంతో మెడికల్ ఆఫీసర్ సుమలతను ప్రశ్నించారు. ఫార్మాసిస్ట్ ఈ రోజు టీకాల సరఫరాకు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి వెళ్లారని బదులిచ్చారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ గురించి అడగగా ఈ రోజు సెలవుల్లో ఉన్నారని వివరించారు. అలాగే ఆయుర్వేదిక్ డాక్టర్, ఫార్మసిస్టులు గైర్హాజర్ కావడంతో వారికి మెమోలు జారీ చేశామన్నారు. అలాగే కుక్క, పాము కాటు వ్యాక్సిన్ల గురించి ఆరా తీయగా 35 నిల్వ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా వడదెబ్బపై గ్రామాల్లోని ప్రజలకు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ద్వారా అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు.



రొయ్యూర్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న అప్పయ్య

బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

వెంకటాపురం(ఎం): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని మాజీ రాష్ట్రమంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం, లక్ష్మీదేవిపేట గ్రామాలలో బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడారు. ఎంపీగా కవితను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం నల్లగుంట గ్రామానికి చెందిన మాజీ మండలాధ్యక్షుడు పోరిక హర్జినాయక్ తండ్రి వాగ్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ అభ్యర్థి కవిత, బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, నాయకులు పోరిక గోవింద్‌నాయక్, మల్క రమేష్, అశోక్, రమణారెడ్డి పాల్గొన్నారు.



వెంకటాపురంలో మాట్లాడుతున్న కవిత

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



ఓటర్ సెల్ఫీ కార్యక్రమంలో ఏపీఓ, అధికారులు



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సతీష్

ఏటూరునాగారం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌వీఈఈపీ పీడబ్ల్యూడీ నోడల్ అధికారిణి స్వర్ణలత లెనినా అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగులు, వయో వృద్ధులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లడానికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. నడవలేని వారి కోసం పోలింగ్ రూంలోకి తీసుకెళ్లడానికి వీల్‌చైర్లతో పాటు ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదే విధంగా వీరికోసం ప్రత్యేకమైన క్యూలైన్లు, తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్డి వంటి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. అంధులకు బ్రెయిలీ లిపిలో బ్యాలెట్ పేపర్లతో పాటు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బధిరులకు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అనంతరం ఏటూరునాగారం ఎంపీడీఓ కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కుపై పలు సూచనలు చేశారు. అనంతరం ఓటర్లతో ఓటు నమోదుపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఐటీడీఏ కార్యాలయం లోని ఉద్యోగులందరికీ ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ వద్ద ఏపీఓ వసంతరావుతో కలిసి ఓటర్ సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, దివ్యాంగుల సంఘం నాయకులు పొన్నం సంతోష్, మాణిక్యరావు, స్థానిక బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఓటర్లకు అవగాహన

మంగపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా వృద్ధాశ్రమంలో ఎస్‌వీఈఈపీ పీడబ్ల్యూడీ నోడల్ అధికారి స్వర్ణలత లెనినా, ములుగు అసెంబ్లీ నోడల్ అధికారి సతీష్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఓటరు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై వారు వివరించారు. ముఖ్యంగా దివ్యాంగులు, వయోవృద్ధులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లడానికి ఉచిత రవాణా సౌకర్యంతో పాటు తదితర అంశాలపై వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ షురూ..

- తొలిరోజు ఓటేసిన 199మంది ఉద్యోగులు
- ములుగులో 30, ఏటూరునాగారంలో ఐదుగురు హోం ఓటింగ్

ములుగు/ఏటూరునాగారం: జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించనున్న 199 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా శనివారం తొలిరోజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో 30మంది హోం ఓటింగ్ వేశారు. ఈ సందర్భంగా తొలిరోజు ఫెసిలిటేషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్న పోస్టల్ బ్యాలెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి చిన్నచిన్న పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఏపీఓలు, పీఓలు, మైక్రో అబ్జర్వర్లు, అత్యవసర విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది 2,364 మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో 16 పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన వారి కోసం 7టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన హోం ఓటింగ్ ఓటర్లు 6వ తేదీ వరకు అధికారుల సమక్షంలో ఓటు వేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ రామకృష్ణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజ్‌ప్రకాష్, తదితరులు ఉన్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



45 బూత్‌లో ఇంటి వద్ద ఓటు వేస్తున్న వృద్ధురాలు

ఏటూరునాగారం మండల కేంద్రంలో ఐదుగురు హోం ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టీం సభ్యులు పీడబ్ల్యూడీ నోడల్ అధికారి స్వర్ణలత, స్థానిక సీడీపీఓ హేమలత, ప్రిసైడింగ్ అధికారి అశ్విన్ ఓటర్ల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఐదుగురు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కిరణ్, స్థానిక పంచాయతీ కార్యదర్శి రమాదేవి, బీఎల్‌ఓలు ఇర్సవడ్ల సరోజ, ఎం. లలితకుమారి, తరంగిణి, శ్రీలత పోలింగ్ సిబ్బంది లక్ష్మీనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఇసుక లారీలు

- ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

మంగపేట: మండల పరిధిలోని గంపోనిగూడెం-కమలాపురం మధ్య ఏటూరునాగారం-బుర్గంపాడు ప్రధాన రోడ్డుపై ఇసుక లారీలు నిలిపి వేస్తుండటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గంపోనిగూడెం మార్కెట్ యార్డు సమీపంలోని గోదావరి ఇసుక క్వారీకి వచ్చే వందలాది లారీలు రోడ్డుపైనే నిలిపి వేస్తున్నారు. దీంతో తరచుగా ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతోంది. ప్రధాన రోడ్డు ఇరుకుగా ఉండటంతో రోడ్డుపైనే ఇసుక లారీలు నిలపడం మూలంగా వచ్చి వెళ్లే ద్విచక్రవాహనదారులు, ఆర్టీసీ బస్సులు, కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిపి ఉంచిన ఇసుక లారీలు

బురద మట్టే అమ్మ పొత్తిళ్లా?

"ఆడపిల్ల రేపటి అమ్మ
బేటీ బచావో బేటీ పడావో..
వివక్ష వద్దు.. ఆడపిల్ల ముద్దు!
ఆడపిల్ల పుడితే అదృష్టం..
ఇలాంటివి నేను కడుపులో ఉండగా వంద విన్నా..
కానీ.. ఇవన్నీ అబద్ధాలేనా?
రంగుల ప్రపంచాన్ని చూసేందుకు ఆశతో వచ్చా..
పుట్టిన వెంటనే నీ చనుబాలు తాగాలనుకున్నా..
నువ్ హత్తుకుంటే నీ పొత్తిళ్లలో ఒదిగిపోవాలనుకున్నా..
కొంగు కప్పి నన్ను బయటకు తీసుకెళ్తుంటే..
ఎండ తగలొద్దని జాగ్రత్త పడుతున్నారనుకున్నా..
ఊరవతలికి తీసుకొస్తే ఇక్కడే మన ఇల్లు ఉందనుకున్నా..
ఆడపిల్ల.. సావు.. అంటూ విసిరేసి వెళ్లిపోయారు..
ఎండ చంపుతోంది.. మట్టి కరుస్తోంది..
బొడ్డు తాడు నొప్పి భరించలేకపోతున్న..
నేనేం తప్పు చేశానమ్మా.. పుట్టగానే నాకెందుకీ శిక్ష?
ఆడపిల్లని నన్ను అవతల పారేశారే..
పిల్లలు పుట్టని వాళ్లెందరో నన్ను కావాలనుకున్నారు..
నేను మీ కడుపులో పుట్టడం తప్పా?
వివక్ష చూపే ఈ మనుషుల మధ్య జన్మించడం తప్పా"

- ఊరుగొండ మట్టికుప్పలో దొరికిన నవజాత శిశువుకు మాటలొస్తే ఇలా ఆక్రందన చెందుతూ ప్రశ్నించేదేమో!

అయ్యో.. పాపం.. ఎంత ఘోరం..

- మట్టికుప్పలో నవజాత శిశువు
- వదిలేసి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు..
- పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- నిలకడగా ఆడ శిశువు ఆరోగ్యం



రోడ్డు పక్కన దొరికిన నవజాత శిశువు



ఎంజీఎం ఆస్పత్రిలో శిశువు

దామెర: అప్పుడే పుట్టిన పసికందు(ఆడ శిశువు)ను రోడ్డు పక్కన వదిలేశారు. ఈహృదయ విదారక ఘటన దామెర మండలం ఊరుగొండ పొలిమేరల్లో జరిగింది. ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులకు అవసరమైన నీటికోసం పక్కనే ఉన్న తొట్టిలోంచి మోటారు సాయంతో నీటిని ట్యాంకులోకి డ్రైవర్ రాందినయ్ ఎక్కిస్తున్నాడు. ఈక్రమంలో రోడ్డు పక్కనున్న మట్టి కుప్పలో నవజాత శిశువు కొంతమేర కూరుకుపోయి, చేతులు కాళ్లు ఆడిస్తూ కనిపించింది. దీంతో వెంటనే తన వద్ద ఉన్న కండువాను రహదారిపై పరిచి శిశువును పడుకోబెట్టాడు. అనంతరం ఏం చేయాలో తెలియక గట్టిగా అరవడంతో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు అక్కడికి చేరుకొని శిశువుకు అంటిన మట్టిని తొలగించారు. దీంతో ఎస్సై కొంక అశోక్ ఘటనా స్థలికి చేరుకొని తన వద్ద ఉన్న టవల్‌తో శిశువు ఒంటికి అంటుకున్న మట్టి, దుమ్మును పూర్తిగా తుడిచారు. 108 వాహనం రావడానికి ఆలస్యమవుతుందని ఎస్సై తన వాహనంలో ఎస్ఎస్ఆర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్ శిశువును ఎంజీఎంకు తరలించారు. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై అశోక్‌ను, పోలీస్ వాహన డ్రైవర్ కుమారస్వామిని, వాటర్ ట్యాంకర్ డ్రైవర్ రాందినయ్‌ని స్థానికులు అభినందించారు.

పాపనివ్వండి.. పెంచుకుంటాం..

విషయం తెలుసుకున్న స్థానికులు చాలామంది పోలీసులకు ఫోన్లు చేసి ఆ పాప గురించి ఆరా తీశారు. పాపను ఇవ్వండి.. మేం బంగారంలా పెంచుకుంటామని విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. కానీ, అలా ఇవ్వడం కుదరదని, దత్తతకు ఓ పద్ధతి ఉంటుందని, దాని ప్రకారం ఇస్తారని వారికి పోలీసులు బదులిచ్చారు.

కారుకొండ సడాలమ్మ వనప్రవేశం




కారుకొండ సడాలమ్మను వనప్రవేశం చేస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: గద్దెలపై నుంచి కారుకొండ సడాలమ్మను శనివారం పూజారులు, వడ్డెలు వనప్రవేశం చేశారు. మండల పరిధిలోని భూపతిపూర్‌లో మూడు రోజులపాటు కారుకొండ సడాలమ్మ జాతరను పూజారులు ఘనంగా నిర్వహించారు. గంగస్నానం నుంచి మొదలుకుని గుట్ట పైనుంచి తీసుకొచ్చి సడాలమ్మను గద్దెపై ప్రతిష్టించారు. ఈ క్రమంలో భూపతిపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సడాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గద్దెపై నుంచి పూజారులు, వడ్డెలు డోలివాయిద్యాలతో వనప్రవేశం చేశారు.

ఓటరు చీటీ.. సమాచారం కోసమే

● పోలింగ్ రోజు ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి



బీఎల్‌ఓలు పంపిణీ చేసిన పోలింగ్ చీటీ

కాజీపేట: చాలా మంది ఓటర్లు తమకు బీఎల్‌ఓలు ఇచ్చిన ఓటరు (పోల్) చీటీ పట్టుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్తారు. చాలా సమయం వరుసలో నిలుచుని తీరా కేంద్రంలోకి వెళ్లిన తర్వాత పోల్ చీటీ కాకుండా ఇంకా ఇతర గుర్తింపు కార్డు ఏదైనా ఉందా అని ఎన్నికల అధికారులు అడిగితే చాలా మంది దగ్గర నుంచి లేదని సమాధానం వస్తుంది. ఓటేయడానికి ఏదో ఒక గుర్తింపు కార్డు కావాలంటే మళ్లీ వెనుకకు వచ్చి ఇబ్బందులు పడడం చూస్తుంటాం. అందుకే ఓటేయాలంటే తప్పనిసరిగా సంబంధిత ఓటరు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు వెంట ఉంచుకోవాల్సిందే. ఎన్నికల అధికారులు అందజేస్తున్న చీటీ పోలింగ్ కేంద్రం, జాబితాలో ఓటరు క్రమ సంఖ్య తదితర సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. అందుకే ఎన్నికల సంఘం 10 రకాల గుర్తింపు కార్డులను సూచించింది. ఇందులో ఏదో ఒకటి ఓటరు వెంట తీసుకెళ్తేనే ఓటు వేసే అవకాశం ఉంది. అంతే కాకుండా ఎన్నికల సిబ్బంది మన వెంట తెచ్చుకున్న కార్డులను నమోదు చేస్తారని గుర్తించాలి.

ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులు ఇవే..

- ఓటరు ఫొటో గుర్తింపు కార్డు
- ఆధార్ కార్డు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- ఆరోగ్య బీమా, స్మార్ట్ కార్డు
- భారతీయ పాస్‌పోర్టు
- పింఛన్ పత్రం
- ఎంపీ, ఎమ్మెల్యేలకు జారీ చేసే గుర్తింపు కార్డు
- ప్రత్యేక వైకల్యం కలిగిన దివ్యాంగులకు కేంద్ర న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసే యూనిక్ డిజిటల్ కార్డు



పూరీ కాల్చి.. ఓటు అభ్యర్థించి

● గూడూరులో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత ప్రచారం



హోటల్‌లో పూరీ కాల్చుతున్న కవిత

గూడూరు: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత శనివారం గూడూరు మండల కేంద్రంలో పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉదయం 6 గంటలకే పార్టీ శ్రేణులు ప్రచారం నిమిత్తం ఓ హోటల్ ఎదుట వేచి ఉండగా అక్కడికి చేరుకున్న కవిత.. అన్నలారా టిఫిన్ చేశారా..?టీ తాగారా? అంటూ పలకరించింది. దీనికి వారు చేయలేదని చెప్పగా, అదే హోటల్‌లో పూరీ కాల్చి శ్రేణులతో కలిసి తానూ భుజించింది. అనంతరం వ్యాపార కూడలిలో ప్రచారం నిర్వహించి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఆడుతూ.. అభ్యర్థిస్తూ..



షటిల్ ఆడుతున్న బీజేపీ అభ్యర్థి రమేశ్

హన్మకొండ: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ శనివారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌ను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి షటిల్ ఆడారు.

హోం ఓటింగ్ షురూ..

నడికూడ: ఎలక్షన్ కమిషన్.. లోక్‌సభ ఎన్నికల్లో దివ్యాంగులు, 80 ఏళ్లు పై బడిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించింది. దీనినే హోం ఓటింగ్ అంటారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని చర్లపల్లిలో అధికారులు.. దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వారితో ఓటు నమోదు చేయించారు.



హోం ఓటింగ్ వేస్తున్న వృద్ధురాలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న రేపాల అనంతలక్ష్మి

హోం ఓటింగ్‌లో శతాధిక వృద్ధురాలు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి నియోజకవర్గంలో శనివారం హోం ఓటింగ్ ప్రారంభించారు. గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన 102 ఏళ్ల వృద్ధురాలు రేపాల అనంతలక్ష్మి తన ఇంటి నుంచి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఓటు వేసింది.

- భూపాలపల్లి అర్బన్

ఎన్నికల నియమాలు పాటించాలి..

ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ సెంటర్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం ముగిసే సమయం నుంచి పోలింగ్ ముగిసే వరకు రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు నియమాలు పాటించాలని ఎన్నికల అధికారి,కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నియమాలు ఇవే..

- పోలింగ్‌కు 48 గంటల ముందుకు అంటే ఈ నెల 11న ప్రచారం ముగిసే సమయం సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు ఒక ప్రదేశంలో ఐదుగురు వ్యక్తులు మించి గుమికూడడం, కలిసి తిరగడం చేయొద్దు. ఇందుకు సంబంధించి సెక్షన్ 144 అమలులో ఉంటుంది.
- ప్రచారం ముగిసిన సమయం (11వ తేదీ 5 గంటల) తర్వాత రాజకీయ పార్టీల నాయకులు, వారి అనుచరులు, ఓటరు కాని వారి నియోజకవర్గ పరిధిలో ఉండడం నిషేధం.
- పోలింగ్ రోజు మద్యం అమ్మకాలు చేపట్టొద్దు. ఆ రోజును డ్రై డేగా ప్రకటించారు.
- లౌడ్ స్పీకర్లు, ఎగ్జిట్ పోల్, ఒపీనియన్ పోల్ చేయడం నిషేధం
- అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన మందులతో ఒక ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పోలింగ్ రోజున నిబంధనలు

- అభ్యర్థికి పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం ఒక వాహనమే వాడాల్సి ఉంటుంది
- అతడి ఎన్నికల ఏజెంట్ కూడా ఒక వాహనం వాడాల్సి ఉంటుంది
- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక వాహనం చొప్పున కార్యకర్తలకు అనుమతి ఉంటుంది.



- ఈ వాహనాల్లో డ్రైవర్‌తో కలుపుకుని ఐదుగురు వ్యక్తులే అనుమతించబడుతారు
- వాహనాల్లో ఓటర్లను తరలించడం శిక్షార్హులు
- పోలింగ్ స్టేషన్‌కు సుమారు 100 మీటర్ల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశంలో ప్రచారం చేయడం, సెల్ ఫోన్లు, లౌడ్‌స్పీకర్లు, మెగా ఫోన్ల వినియోగం నిషేధం
- పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల అవతల ఒక టేబుల్, రెండు కుర్చీల వరకు అనుమతి ఉంటుంది. షామీయానాలు, టెంట్‌లకు అనుమతి లేదు.
- పోలింగ్ ఏజెంట్లు కచ్చితంగా ఎన్నికల గుర్తింపు కార్డు కలిగి ఉండాలి
- అభ్యర్థి పేరు / పార్టీ గుర్తులు లేకుండా ఉండే తెల్ల కాగితంపై రాసిన ఓటర్ స్లిప్పుకు మాత్రమే అనుమతి

పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు..

- ఓటర్లు త్వరితగతిన తమ వివరాలు తెలుసుకునేందుకు అక్కడి పోలింగ్ స్టేషన్ లోకేషన్‌లో ముందు భాగంలో గల సిబ్బంది ఇంగ్లిష్ అక్షర క్రమాది ఓటరు జాబితాతో సిద్ధంగా ఉంటారు.
- పోలింగ్ స్టేషన్ల వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయి.
- అంధ ఓటర్ల వెంబడి సహాయకుడికి అనుమతి ఉంటుంది.
- పోలింగ్ రోజు వేతనంతో కూడా సాధారణ సెలవు దినంగా ప్రకటన
- పోలింగ్ కేంద్రాలు గల విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, స్కూళ్లు, ఇతర సంస్థలకు సంబంధించిన సిబ్బంది, విద్యార్థులు, పోలింగ్ సిబ్బంది నియామకం పొందిన వారికి పోలింగ్ ముందు రోజు (12న) కూడా సాధారణ సెలవు ఉంటుంది.

ఓటరు స్లిప్పులు ..

- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటరు స్లిప్పులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు సంబంధిత బూత్ లెవల్ అధికారుల ద్వారా ఏప్రిల్ 25 నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ మే 6వ తేదీలోగా పూర్తి చేయనున్నారు.
- ఫొటో ఓటర్ స్లిప్పు.. ఓటరు ఏ పోలింగ్ కేంద్రంలో, ఏ వరుస సంఖ్యలో నమోదయ్యాడనే విషయం తెలుపుతుంది.
- ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్‌లు / పోస్టాఫీసు ఫొటోతో జారీ చేసిన పాస్‌బుక్‌లు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్, ఆర్‌జీఐ జారీ చేసి స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్ పోర్ట్, ఫొటో కలిగిన పెన్షన్ పత్రం , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఫొటోలతో జారీ చేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, ఐడీ కార్డులు కలిగి ఉండాలి.

కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

మహబూబాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని నలందా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని సంపూర్ణంగా సవరించాలని పూనుకుంటుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడిద్దాం.. రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. బీజేపీ ప్రభుత్వంలో రైతులందరూ యాభైశాతం అప్పుల పాలయ్యారన్నారు. వ్యతిరేక చట్టాలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట్ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటులో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీపీజేఏసీ రాష్ట్ర నాయకుడు మైస శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మామిడాల సత్యనారాయణ, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి అంబటి శ్రీనివాస్, నాయకులు ఆరుద్ర పరమాత్మాచారి, బోనగాని రవీందర్, జావీద్, రామచందర్, అనిల్, మనోజ్, ఖాజాపాషా, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల నగదు పట్టివేత..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్ పోలీసులు శనివారం రూ.1.50 లక్షల నగదు పట్టుకున్నారు. ఎస్సై జి.ఉపేందర్ పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో మహబూబాబాద్‌కు చెందిన ముదిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి బైక్‌ను తనిఖీ చేయగా రూ.1.50 లక్షల నగదు లభించింది. దీనికి ఆధారం చూపకపోడంతో స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఆర్.సుగుణాకర్‌కు అప్పగించారు.

గాదెవాగు వద్ద రూ.1.50 లక్షలు..

కొత్తగూడ: కొత్తగూడ–నర్సంపేట ప్రధాన రహదారి గాదెవాగు వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన మహేందర్‌రెడ్డి వద్ద రూ. 90వేలు, కొత్తగూడ మండలం దుర్గారం తండాకు చెందిన పరమేష్ వద్ద రూ. 60వేలు లభించాయి. ఈ నగదుకు ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని ములుగు కలెక్టరేట్‌లో డిపాజిట్ చేసినట్లు గూడూరు సీఐ బాబూరావు తెలిపారు.

చింతపండు బస్తాల మధ్య గంజాయి రవాణా..

● నలుగురి అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : చింతపండు, యూరియా బస్తాల మధ్య గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.35 లక్షల విలువైన 9.5 కిలోల గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా వీర్లపాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన ఈదవ కృష్ణ నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా చింతగాని మండలం కోదుమూరు గ్రామానికి చెందిన ఆనుమోలు వెంకటరమణ స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరుకు చెందిన సురేష్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా చింతపండు, యూరియా బస్తాల నడుమ రహస్యంగా భద్రపర్చి హనుమకొండలో ఉండే హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ రహీం, మధ్యప్రదేశ్‌లోని రీవా జిల్లా మన్గవ్ మండలం ధారావిఖ గ్రామానికి చెందిన ఓ మైనర్‌కు అందజేసేందుకు శుక్రవారం బస్సులో హనుమకొండ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇక్కడ అబ్దుల్ రహీం, మైనర్‌కు గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై సమాచారం అందుకున్న హనుమకొండ ఎస్సై శ్రవణ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా తాము గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు నలుగురు ఒప్పుకున్నారు. దీంతో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, ముఠా సభ్యుడైన ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరుకు చెందిన సురేష్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ వివరించారు.

నేలకొరిగిన విప్లవ కెరటం..


● ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు రవి మృతి
● వంగరకు చేరుకున్న మృతదేహం
● నివాళులర్పించిన పలు సంఘాల నాయకులు



నివాదాలు చేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : సికాస భావాలకు ఆకర్షితుడై (సింగరేణి కార్మిక సంఘం) 33 ఏళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరిన కాసవేని రవి అలియాస్ వినయ్ ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈఘటనపై సమాచారం అందుకున్న మృతుడి కుటుంబసభ్యులు రవి మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాకు చేరుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు.. రవి మృతదేహం అప్పగించగా శనివారం స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలం వంగరకు చేరుకుంది. దీంతో అమరుల బంధుమిత్రుల సంఘం, పౌర హక్కుల సంఘం, దళిత లిబరేషన్ ఫ్రంట్, విరసంతో పాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకుని రవి మృతదేహానికి నివాళులర్పించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి మాట్లాడుతూ ఆపరేషన్ కాగర్, డ్రోన్ల ద్వారా నక్సల్స్ స్థావరాలను గుర్తించి విషపూరిత రసాయనాలు స్ప్రే చేస్తూ స్పృహ కోల్పోయేలా చేసి బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అడవిలోని 300 ఎకరాల ఖనిజ సంపదను స్వదేశీ కార్పొరేట్లకు అప్పగించడం కోసం సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యాన్ని అడవిలో ఉన్న ఆదివాసుల మీదికి ఉసిగొల్పి ఊచకోత కోస్తోందని మండిపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, కార్యదర్శి పద్మకుమారి, శాంతమ్మ, హుస్సేన్ శోభ, విరసం కార్యదర్శి బాలసాని మధు, పౌరహక్కుల సంఘం నేత మాదన్న కుమార్, నాయకులు రాజగోపాల్, సుదర్శన్ ఉన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి



సుమంత్ మృతదేహం

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తలక్ష్మీపురంలో శనివారం పిడుగుపాటుకు రైతు పాడుగు సుమంత్(26) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సుమంత్ సాయంత్రం సమయంలో మొక్కజొన్న చేను వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా గాలివాన మొదలైంది. ఈ క్రమంలో ఓ చెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగుపడడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చేరుకుని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సుమంత్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వడదెబ్బతో ఏడుగురి మృతి



భానుడి భగభగతో జనం అల్లాడుతున్నారు. ఎండవేడిమిని తట్టుకోలేక వడదెబ్బకు గురై పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఏడుగురు మృతిచెందారు.

చెన్నారావుపేట: వడదెబ్బతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని అక్కల్‌చెడలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన ఆకుల భాస్కర్(25), హరియాతండాకు చెందిన బాదావత్ నర్సింహ(100) ఎండ వేడికి తాళలేక వాంతులు చేసుకుని మరణించినట్లు తెలిపారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, పావని రమేష్ పరామర్శించారు.

రంగాపూర్‌లో ఒకరు..

గోవిందరావుపేట : మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన వంక లక్ష్మి వడదెబ్బతో శనివారం మృతి చెందారు.లక్ష్మి ఎండ తీవ్రత తట్టుకోలేక, వడ దెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



లక్ష్మి (ఫైల్)

ఇప్పల్‌తండాలో ఒకరు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇప్పల్ తండాకు చెందిన అజ్మీరా మంగ్యా (45)కు గ్రామ శివారులో మూడెకరాల భూమి ఉంది. ఇటీవల వరి కోసి ధాన్యాన్ని అక్కడే ఆరబోశారు. మూడురోజుల నుంచి ధాన్యం నేర్పేందుకు ఎండలో వెళ్తున్నాడు. ఈక్రమంతో మంగ్యా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నర్సంపేటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భోజమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.



మంగ్యా (ఫైల్)

కొత్తగూడలో వృద్ధుడు..

కొత్తగూడ : వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల కనకయ్య(75) శుక్రవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. నర్సంపేట పట్టణంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కనకయ్య (ఫైల్)

రేగులగూడెంలో రైతు..

కాటారం : వడదెబ్బతో అస్వస్థతకు గురై రైతు మృతి చెందిన సంఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడెంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేకల లస్మయ్య(56) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల వరి కోతలు పూర్తికాగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. రోజులాగే కొనుగోలు కేంద్రానికి వెళ్లి ధాన్యం ఆరబెట్టేందుకు వెళ్లిన లస్మయ్య ఎండ తీవ్రతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా ఇంటికి చేరుకునేలోపే పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.



లష్మయ్య (ఫైల్)

పెద్దముప్పారంలో వృద్ధుడు..

దంతాలపల్లి : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో వడదెబ్బతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గొడిశాల దేవయ్య(70) ఎండ తీవ్రత భరించలేక మధ్యాహ్నం అస్వస్థకు గురై మృతి చెందినట్లు తెలిపారు.



దేవయ్య (ఫైల్)

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
ఆదివారం ॥ 5-5-2024







మీ నవ్వుల చల్లదనాన్ని మంచుకొండ అప్పడిగింది...




ఒకరు జోక్ వేస్తే నవ్వడం చాలా వీజీ. నవ్వించడం మాత్రం నవ్వినంత ఈజీ కాదు. టోటల్‌గా చెప్పొచ్చేదేమిటంటే... నవ్వించడం అనేది అత్యంత కష్టతరమైన టాస్క్. ఈ నవ్వుల మహారాణులు మాత్రం అవలీలగా నవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

నిఫ్ట్ గ్రాడ్యుయేట్ అయిన కుష కపిల బిల్లీ మసి, సౌత్ దిల్లీ గర్ల్స్‌లాంటి క్యారెక్టర్లతో నవ్వుల వర్షం కురిపిస్తోంది. ఆమెకు 1.6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. నిత్యజీవిత సంఘటనల ఆధారంగా దిల్లీకి చెందిన డాలీసింగ్ కామెడినీ మేడ్ ఈజీ చేసింది. ముంబైకి చెందిన ప్రజక్తా కోలి కామెడీ వీడియోలు మోస్ట్ పాపులర్ అయ్యాయి. అబ్జర్వేషనల్ కామెడీకి ఆమె వీడియోలు అద్దం పడతాయి. కోలికి యూట్యూబ్‌లో 6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్టాండ్–అప్ కమెడియన్‌గా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది ప్రశస్తి సింగ్. అమెజాన్ ప్రైమ్ వీడియో సిరీస్ 'కామిక్‌స్థాన్' సూపర్ హిట్ అయింది. ఎంబీఏ చేసిన ప్రశస్తి 'నవ్వించడం' తన ప్యాషన్ అంటోంది. వీరు మాత్రమే కాదు కనీజ్ సుర్క, శ్రిష్టి దీక్షిత్, నిహారిక ఎన్ఎం, సుప్రియ జోషి, సుముఖి సురేష్, ఐశ్వర్య మోహన్‌రాజ్, సుమైర... లాంటి ఎంతో మంది నవ్వుల ప్రపంచంలో మహారాణులుగా వెలిగిపోతున్నారు.

వైరల్

సిగ్నల్ నీడలో



బతుకు గడవాలంటే రోడ్డు మీదకు రాక తప్పదు. వస్తే భయంకరమైన ఎండ. దాంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వేచి ఉండాల్సిన బాధ. అందుకే పాండిచ్చేరి ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్ ఏర్పాటు చేసింది. వీటిని ఒక స్కూటరిస్ట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. వైరల్ అయిన ఈ పందిళ్లను చూసి చాలా మంది తమ నగరాల్లో కూడా ఇలా జరిగితే బాగుండని కోరుకుంటున్నారు.

మన దేశంలో ఎండలు విపరీతమవడం గతంలో కూడా ఉంది. సాధారణంగా మైదానప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియెస్, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియెస్ దాటితే వడగాడ్పు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. 2016లో జోధ్‌పూర్‌లో 51 డిగ్రీల రికార్డు టెంపరేచర్ నమోదైంది. 2019లో లాంగెస్ట్ హీట్‌వేవ్‌ను దేశం చూసింది. 32 రోజుల పాటు సాగిన వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్ అల్లాడిపోయింది విదర్భ, రాజస్థాన్ కాకుండా. అందుకే మన దేశంలో మే నెలను చూసి జనం గడగడ వొణుకుతారు. బయటికొస్తే వాహనదారులకు నిలువ నీడ ఉండదు. ఇలాంటి సమయంలో పాండిచ్చేరిలో ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్స్ ఏర్పాటు చేసింది. దీని వల్ల ఎండలో తిరిగే వారికి నీడ కింద ఉపశమనం దొరికినట్టవుతుంది... దాంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించినట్టవుతుంది. ఒక వాహనదారుడు ఇన్‌స్టాలో రిలీజ్ చేసిన పాండిచ్చేరి గ్రీన్‌షేడ్స్‌ను చూసి ప్రతి ఒక్కరూ మా నగరాల్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుండు అంటున్నారు. ప్రభుత్వాలు వింటే బాగుండు.

నీటి పిట్టలు



'స్విమింగ్ పూల్ అంటే ఎలా ఉంటుంది సార్?'
అని అడిగారా పల్లెటూరి స్కూల్ పిల్లలు.
స్కూల్ ప్రిన్సిపల్‌కి చివుక్కుమంది.
ఎండల్లో జలకాలాడే చిన్న సరదా కూడా
తన స్కూల్ పిల్లలకు లేకపోతే ఎలా అనుకున్నాడు.
ఆ తర్వాత అతడేం చేశాడు?
పిల్లలు నీటి పిట్టలు ఎలా అయ్యారు?
వైరలైన ఈ వివరం వినండి.

ఉత్తరప్రదేశ్‌లో అత్తర్ల తయారీకి వాసికెక్కిన కన్నౌజ్‌కు పక్కనే ఉండే తిర్వా అనే ఊరిలోని ఒక ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు స్విమ్మింగ్ పూల్ ఎలా ఉంటుందో తెలియదు. 'వేసవి కాలంలో నగరాల్లో డబ్బున్నవాళ్లు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈత కొడతారు' అని స్కూల్ ప్రిన్సిపాల్ వైభవ్ సింగ్ పిల్లలకు మాటవరసకు చెప్తే పిల్లలు 'అదెలా ఉంటుంది సార్' అనడిగారు. 'మేమెందుకు అలాంటి పూల్‌లో ఈత కొట్టకూడదు' అనంటే మన చుట్టుపక్కల పూల్స్ లేవు అని ప్రిన్సిపాల్ అన్నాడు. కాని అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఒక క్లాస్‌రూమ్‌లో నీళ్లు నింపి ఇదే పూల్ అన్నాడు. తల్లిదండ్రుల అనుమతి అడిగి స్కూల్ అయ్యే సమయానికి అందులో కేరింతలు కొట్టే అవకాశం ఇచ్చాడు. ఇంకేముంది... పిల్లలకు హుషారే హుషారు. స్కూల్ ఎగ్గొట్టడంలో ఘనాపాఠీలైన పిల్లలు కూడా పలక తీసుకొని పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఊళ్లోని తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలు నీళ్లల్లో కేరింతలు కొడుతుంటే చూసి సంతోషపడుతున్నారు. ఈ వీడియో వైరల్ అయ్యింది.

నేడే చూడండి... గుర్రం గారి డ్యాన్స్



'కొత్త బట్టలు కుట్టిస్తారు. గుర్రపు స్వారీ చేయిస్తారు' అని పెళ్లికుమారుడి గురించి మురిపెంగా చెబుతుంది ఓ సిన్మా పాట. ఈ పాట మాట ఎలా ఉన్నా కొన్ని పెళ్లి ఊరేగింపులలో గుర్రం పరేషాన్ చేస్తుంటుంది. లక్నోలో ఒక పెళ్లి ఊరేగింపులో బాంబుల మోత భరించలేక 'ఐ డోన్ట్ లైక్ ఇట్' అంటూ గుర్రం పరుగులు తీసింది. గుర్రంపై ఉన్న పెళ్లికుమారుడు భయంతో లబోదిబో అన్నాడు. ఇక తాజా విషయానికి ఇస్తే... ఒక పెళ్లి ఊరేగింపులో ఒక కుర్రాడు డ్యాన్స్ చేస్తున్నాడు. లెక్క ప్రకారం అయితే పెళ్లి ఊరేగింపు గుర్రం ఇట్టి దృశ్యాలను మౌనంగా చూస్తుంది. మరి మన గుర్రానికి ఏమనిపించిందో తెలియదుగానీ ఆ డ్యాన్సర్‌కు తగినట్లు స్టెప్పులు వేయడం మొదలుపెట్టింది. గుర్రంపై కూర్చున్న వరుడి గుండెల్లో మెట్రో రైళ్లు పరుగెత్తడం మాట ఎలా ఉన్నా... అక్కడ ఉన్న జనాలకు గుర్రం డ్యాన్స్ తెగ నచ్చి ఈలలు వేయించింది. మనోజ్ పటేల్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

కూల్ మీమ్స్



















హెల్త్

• చర్మంపై

వేసవి ఎండ ప్రభావం... జాగ్రత్తలు!



మనపై వేసవి ఎండల ప్రభావాలు ఎలా ఉన్నప్పటికీ... నేరుగా ప్రభావితం చేసేది చర్మాన్నే. ఎండ ప్రభావం ప్రత్యక్షంగా ఉండటంతో మేని రంగు మారడం, చర్మం కమిలిపోవడం వంటివి సహజం. ప్రధానంగా చిన్నపిల్లల్లో చెమటకాయలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి ఎండల్లో చర్మంపై చూపే దుష్ప్రభావాలూ, వాటి నివారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం...



వేసవిలో ఈ కింద పేర్కొన్న అనేక రకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశముంది.

చెమటకాయలు (మిలీరియా)... చెమటకాయలు ముఖ్యంగా పిల్లల్లోనూ, కొందరు పెద్దల్లో కూడా కనిపిస్తుంటాయి. వేడి వాతావరణంలో చర్మంపైన ఉండే స్వేదగ్రంథులు మూసుకుపోయి వాపు రావడం వల్ల వేసవిలో ఇవి వస్తుంటాయి. చర్మంపైన ఎర్రటి ర్యాష్‌లాగా కొన్నిసార్లు మాడినట్లుగా నలుపురంగులో కనిపిస్తుంటాయి. పిల్లల్లో చెమట గ్రంథులు పూర్తిగా ఎదగక పోవడం, వేడిమి, ఎండలో విపరీతంగా ఆడటం చెమటకాయలు రావడానికి ప్రధాన కారణాలు.

నివారణ / చికిత్స: చెమటకాయలు వచ్చినప్పుడు పిల్లలకు గాలి బాగా ఆడేలా వదులుగా ఉండే దుస్తులు (కాటన్‌వి అయితే మరీ మంచిది) ధరింపజేయాలి.
● గాఢత తక్కువగా ఉండే మైల్డ్ సబ్బులు వాడాలి. ● కాలమైన్ లోషన్ రాసుకోవడం మంచిది. ● పిల్లలు ఎండల్లో ఎక్కువగా ఆడకుండా జాగ్రత్త పడాలి. చికిత్సలో భాగంగా ప్రిక్లీ హీట్ పౌడర్ వాడాలి. తగ్గకపోతే ఎమోలియెంట్స్ అనే క్రీముల్ని డాక్టర్ సలహా మేరకు రాయాలి.

మంగుమచ్చలు/ మెలాస్మా... చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం వల్ల చర్మంపైన ఉండే మెలనోసైట్స్ అనే కణాలు పెరిగి, చర్మం నల్ల బారుతుంది. ఈ పిగ్మెంటేషన్‌ను మెలాస్మా అంటారు.

జాగ్రత్తలు/ చికిత్స: పిగ్మెంటేషన్ ఉన్న వారు రోజూ రాత్రివేళ కోజిక్ యాసిడ్, ఆర్బ్యుటిన్, విటమిన్-సి ఉన్న క్రీములు రాసుకోవాలి. ● 40 ఎస్‌పీఎఫ్ కంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్‌ను ప్రతి మూడుగంటలకోసారి రాయాలి.

మొటిమలు ఎక్కువగా రావడం.. వేసవి వేడి వాతావరణంలో తేమ (హ్యుమిడిటీ) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ గ్రంథులు ఎక్కువగా పనిచేసి, సీబమ్ అనే నూనె లాంటి ద్రవం స్రవిస్తుంది. అలాగే ముఖంపై ఉండే 'పైలో సబేషియస్ యూనిట్' అనే వ్యవస్థ చాలా చురుగ్గా పనిచేయడంతో చర్మంపై ఎక్కువ చెమట పట్టడంతో, సీబమ్ అనే నూనె లాంటి ద్రవాల స్రావాలతోనూ ఈ గ్రంథుల రంధ్రాలు మూసుకుపోతాయి. దాంతో అక్కడ బ్యాక్టీరియా పెరిగి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఇలా ఈ సీజన్ మొటిమల ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంటుంది.


నివారణ / చికిత్స : మొటిమల్ని ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీలోని కెఫిన్ ప్రధానమైనది. అందుకే టీనేజీ పిల్లలకు కొవ్వులు, చక్కెర పాళ్లు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్నే ఇవ్వాలి. ఎవరికి వారు తాము తీసుకునే ఆహారాల్లో కొన్ని ఐటమ్స్ సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించేవి అని గుర్తిస్తే వాటికి దూరంగా ఉండాలి. ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు క్వాలిఫైడ్ దర్మటాలజిస్టును కలిసి వారి సూచన మేరకు క్లిండామైసిన్ అండ్ ఎడాపలీన్ కాంబినేషన్ ఉన్న క్రీమును ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యుల సలహా మేరకు యాంటీబయాటిక్స్ కూడా వాడాల్సి ఉంటుంది.



డా. కె.ఎస్.ఎన్. రవితేజ
సీనియర్ డర్మటాలజిస్ట్ & కాస్మటాలజిస్ట్

ఈత జబ్బులతో జర భద్రం

ఒకప్పుడు వేసవి సెలవులు రాగానే ఎనిమిదీ పదేళ్ల పిల్లలంతా ఊళ్లలో బావులకు ఈతకు వెళ్లేవారు. ఇప్పుడా సంఖ్య కాస్త తగ్గినా ఇంకా అలా ఈతకెళ్లేవాళ్లు ఉండనే ఉన్నారు. పల్లెలూ, పట్టణాల పిల్లలైతే సెలవులు కాబట్టి దగ్గర్లోని సముద్ర తీరం దగ్గరికి స్నానాలకు వెళ్లడం, నదుల్లో, చెరువుల్లో ఈదులాడటం మామూలే. ఇక నగరవాసుల పిల్లలు స్విమ్మింగ్ క్లాసులంటూ ఈత నేర్చుకోడాలు ఈ సీజన్‌లోనే ఎక్కువ. దానికితోడు టబ్ బాత్‌లూ, అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో స్ప్లాష్ బాత్, కృత్రిమ కెరటాల్లో ఈదులాటలూ ఉంటాయి. అయితే ఈత సంబంధమైన వినోదక్రీడల్లో, వాటర్ స్పోర్ట్స్‌లో పిల్లలకు ప్రమాదాలు తెచ్చిపెట్టే ముప్పులు ఉండనే ఉంటాయి. అవేమిటో, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.



ఈత రానప్పుడు... అది స్విమ్మింగ్‌పూల్‌గానీ లేదా చెరువు, వాగు, నదిలో మునిగిపోయే ప్రమాదమే అన్నిటి కంటే పెద్ద ముప్పు. ఇలాంటి సందర్భాల్లో ఈత తెలిసినవారు తప్పక పక్కనే ఉండాలి. పిల్లవాడు మునిగిపోతున్నట్లు గమనించిన వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి సమతలంగా ఉండే ప్రదేశంలో పడుకోబెట్టాలి. కోలుకునేందుకు చేయాల్సిన పరిచర్యలివి...
● ప్రమాదానికి గురైన చిన్నారి తల పక్కకు ఉండేలా, ఎడమవైపు ఒరిగి ఉండేలా చూసుకోవాలి. ● ఛాతీని గమనిస్తూ, శ్వాస ఆడుతుందో లేదో చూడాలి. శ్వాస తీసుకోలేకపోతుంటే గదమ భాగం పైకి ఉండేలా చేసి, గొంతులో ఏదైనా అడ్డుగా ఉందేమో చూడాలి... ఉంటే ఆ అడ్డును తొలగించాలి.
● తర్వాత బోర్లా పడుకోబెట్టి వీపుపై మన రెండు అరచేతులు అనించి, బలంగా నొక్కాలి. దీనివల్ల ఊపిరితిత్తుల్లో ఏమైనా నీళ్లు ఉంటే బయటకు వెళ్లిపోతాయి. శ్వాసక్రియ మళ్లీ మొదలవుతుంది. ● కొందరు నీళ్లు తాగేస్తారు. అలాంటప్పుడు కడుపుపై విడతలవారీగా నొక్కుతూ నీళ్లు బయటకు వెళ్లేలా చేయాలి. దాంతో శ్వాసక్రియ తేలిగ్గా జరుగుతుంది. నోటితో గాలి ఊదేటప్పుడు పిల్లవాడి ముక్కు మూయాలి. మన నోరు పక్కకు తీసినప్పుడు ముక్కు తెరచి ఉంచాలి. ఈ రెండింటి మధ్య కొంత వ్యవధి ఇస్తూ ఒక క్రమపద్ధతిలో చేస్తుండాలి.
● ఆ తర్వాత వాళ్లను పొడిబట్టల్లోకి మార్చాలి.

ఇతర ఆరోగ్య సమస్యలు...

నీళ్ల విరేచనాలు (డయేరియా): ఈదుతున్న నీళ్లలో ఉండే ఈ–కొలై, షిజెల్లా, క్రిప్టోస్పోరీడియమ్, నోరో వైరస్ వంటి సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాల సమస్య రావచ్చు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వంటి మందులతో పాటు దేహద్రవాలను కోల్పోకుండానే, క్రిములను మాత్రం బయటకు పంపేలా చేసే విరేచనాలు కట్టుబడే మాత్రలు వాడాల్సి ఉంటుంది.

చెవిలో నొప్పి లేదా స్విమ్మర్స్ ఇయర్: 'ఒటైటిస్ ఎక్స్‌టర్నా' అనే ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో చెవి నొప్పి, చెవిలో దురద, నీరుకారడం, చెవి ప్రాంతంలో వాపు కనిపిస్తాయి. దీని నివారణకు ఈత పూర్తి కాగానే తువ్వాలతో చెవుల్ని, ఇయర్ కెనాల్‌నూ పొడిగా మారేలా తుడవాలి. అప్పటికీ తగ్గపోతే డాక్టర్ సలహా మీద చెవుల్లో యాంటీబయాటిక్ చుక్కల మందులు వాడాలి. ఈ ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈత సమయంలో ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.

హాట్ టబ్ ర్యాష్: కలుషితమైన నీళ్లలో ఈదటం వల్ల చర్మానికి వచ్చే సమస్య ఇది. ర్యాష్ వచ్చినచోట చర్మం ఎర్రబారి దురద పెడుతుంటుంది. చర్మంపై రోమాంకురాల చివర్లలో చీముపొక్కుల్లా వస్తుంటాయి. స్విమ్‌సూట్ ధరించిన ప్రాంతాల్లో లక్షణాల తీవ్రత మరీ ఎక్కువ. ఈ సమస్య నివారణకు ఈత పూర్తయిన వెంటనే స్విమ్ సూట్ తొలగించి, సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.


కళ్లు ఎర్రబారడం: ఈత తర్వాత చాలామంది కళ్లు ఎర్రబారినట్టుగా ఉంటాయి. ఈదులాడే చోట అనేక రకాల మానవ కాలుష్యాలు, ఇతర రసాయనాల వల్ల నీళ్లు కలుషితం కావడమే ఇందుకు కారణం. ఒకవేళ స్విమ్మింగ్‌పూల్‌లో ఇలాంటి సమస్య వస్తే... ఆ నీటిని క్లోరినేషన్ ద్వారా డిస్–ఇన్‌ఫెక్ట్ చేయాల్సి ఉంటుంది. చెరువు, కొలను వంటి ఇతర వనరులైతే అలాంటి చోట ఈత కొట్టకపోవడమే మేలు.

సైనసైటిస్: నీటి కొలనులు, చెరువుల వంటి చోట్లలో ఈదులాడుతున్నప్పుడు మన తలలో ఉండే సైనస్ అనే ఖాళీ ప్రదేశాలలో నీరు చేరి, అక్కడ సూక్ష్మజీవులు పెరగడం వల్ల ముక్కు నుంచి స్రావాలు కారుతుండటం, ఒక్కోసారి కణతల వద్ద తలలో, చెవుల్లో నొప్పి రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు డాక్టర్ సలహా మేరకు యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మాత్రలు వాడాల్సి రావచ్చు.



ఇతర ఇన్ఫెక్షన్లు: కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల జ్వరం, ఆకలి తగ్గడం, తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే పిల్లల ప్రైవేట్ పార్ట్స్ దగ్గర పిన్‌వార్మ్స్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల్లోకి కలుషితమైన నీరు ప్రవేశించడం వల్ల తీవ్రమైన దగ్గు లేదా శ్వాస సమస్యలు రావచ్చు.

ఈత సమస్యల నివారణ కోసం...
● పిల్లలు ఈతకొడుతున్నప్పుడు సీఆర్‌పీ వంటి ఫస్ట్ ఎయిడ్ పద్ధతులు, ఈదడం తెలిసిన పెద్దలు తప్పక పక్కనే ఉండి తీరాలి.
● ఈత ఎంతో ఆరోగ్యకరమైన వ్యాయామమైనప్పటికీ దాంతో వచ్చే సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించి, ఆ మేరకు వారు జాగ్రత్తలు తీసుకునేలా వాళ్లలో అవగాహన పెంచాలి. ● పిల్లలు ఈదులాడే కొలను, నదులు, చెరువులు శుభ్రంగానే ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వారిని ఈతకు అనుమతించాలి. స్విమ్మింగ్‌పూల్ అయితే నిర్ణీత వ్యవధుల్లో ఈ నీటిని క్లోరిన్‌తో ట్రీట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ● వీలైతే పిల్లల చెవుల్లోకి నీరు పోకుండా ఇయర్ ప్లగ్స్, కళ్లకు గాగుల్స్ వంటివి ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.



డా. ప్రవీణ్‌కుమార్ కులకర్ణి,
సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వాటర్ కూలర్‌తో ఒకింత జాగ్రత్త!

చాలారోజుల తర్వాత వాడుతున్న వాటర్ కూలర్ విషయంలో ఒక్క జాగ్రత్త తప్పనిసరిగా పాటించి తీరాలి. అదేమిటంటే... వాటర్ కూలర్‌లో ఎంతోకొంత నీరు ఉండి, దాన్ని చాలారోజుల పాటు ఆన్ చేయకుండా ఉన్నప్పుడు ఆ వాటర్ కూలర్ మెష్‌లో ఉండే బ్యాక్టీరియాతో 'లీజియొనైర్స్ డిసీజ్' అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి వల్ల లంగ్స్ ప్రభావితమవుతాయంటున్నారు డాక్టర్లు. అప్పటికే ఆస్తమా ఉన్న వారిలో ఈ 'లీజియొనైర్స్ డిసీజ్' మరింత ప్రమాదకరం కావచ్చంటూ హెచ్చరిస్తున్నారు. అందుకే కూలర్ వాడే ముందర ఒకసారి అందులోని పాత నీరంతా డ్రై అయిపోయేలా ఆన్ చేసి ఉంచాలి. ఆ తర్వాత కూడా ఒకసారి ఫ్రెష్‌గా మరికాసిని నీళ్లు పోసి, అవి కూడా పూర్తిగా ఇగిరిపోయేలా చేయాలి. అటు తర్వాత తాజాగా నీళ్లు పోసి, అప్పుడు వాడుకోవాలంటూ డాక్టర్లు సలహా ఇస్తున్నారు.

